ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



జిల్లాలో 29 బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటు

పార్వతీపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 29 టవర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ (శ్రీకాకుళం) జి.ఆడమ్ తెలిపారు. శుక్రవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. జిల్లాలో త్వరలో 4జీ సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. 'మన్యం'లో బ్రాడ్‌బ్యాండ్ 43, ఫైబర్ 401 కనెక్షన్లు ఉన్నాయన్నారు. పార్వతీపురం నెట్‌వర్క్ పరిధిలో ల్యాండ్ లైన్స్ 2,889, బ్రాడ్‌బ్యాండ్ 354, ఎఫ్‌టీటీహెచ్ 5856, ప్రీపెయిడ్ కనెక్షన్లు 2,17,589 వరకు ఉన్నాయని తెలిపారు.

నేడే.. మోగనున్న నగారా

- కొద్ది గంటల్లోనే సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల
- ఆ వెంటనే కోడ్ అమలులోకి.. ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- వేడెక్కనున్న రాజకీయాలు... ఊపందుకోనున్న ప్రచారాలు
- గత వారం రోజులుగా శంకుస్థాపనలతో వైసీపీ ప్రజాప్రతినిధులు బిజీ బిజీ

పార్వతీపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు శనివారం నగారా మోగనుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం నిర్వహించి షెడ్యూల్‌ను ప్రకటించనుంది. గతంలో మాదిరిగానే పార్లమెంట్, శాసనసభ ఎన్నికలను ఒకేసారి నిర్వహించనున్నారు. ఏదేమైనా కొద్ది గంటల్లోనే షెడ్యూల్ ప్రకటించనుంది. ఏయే తేదీల్లో ఎన్నికలకు ప్రకటన విడుదల అవుతుందనేదీ.. నామినేషన్ల స్వీకరణ... స్క్రూట్నీ, పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలను వెల్లడించనుంది. కాగా ఆ సమయం నుంచే అంతటా ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. అయితే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతునారు. ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లోనూ వసతులు ఏర్పాటు చేశారు. జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపైనా దృష్టి సారించారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతాలకు పెద్దఎత్తున కేంద్ర పోలీసు బలగాలు చేరుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పకడ్బందీగా పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి ...

జిల్లాలో నాలుగు నియోజకవర్గాలున్నాయి. పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గాలు అరకు పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. సాలూరు నియోజకవర్గంలో 2,02,302 మంది, కురుపాంలో 1,93,073 మంది, పార్వతీపురంలో 1,88,438 మంది, పాలకొండలో 1,93,920 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తంగా నాలుగు నియోజకవర్గాల్లో 7,77,733 మంది ఓటర్లు ఉన్నారు. వారంతా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 2019 ఎన్నికలకు సంబంధించి మార్చి 10న షెడ్యూల్ వెల్లడైంది. ఏప్రిల్‌లో ఎన్నికలు జరగ్గా.. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించారు. ఈ సారి కూడా ఏప్రిల్, మే నెలలోనే ఎన్నికలు, ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రధాన రాజకీయపార్టీలైన టీడీపీ, వైసీపీ నుంచి కొంతమంది అభ్యర్థులను ఖరారు చేశారు. టీడీపీ అధిష్ఠానం సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. నేడు షెడ్యూల్ విడుదల కానుండడంతో.. అతి త్వరలో మిగిలిన పాలకొండ నియోజకవర్గానికి అభ్యర్థిని ఖరారు చేయనుంది.



టీడీపీ నేతల్లో జోష్

జిల్లాలో ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. భారీ సభలు నిర్వహించారు. అధికార పార్టీ నేతల అక్రమాలను తూర్పారబట్టారు. వైసీపీ సర్కారు మోసాల గురించి ప్రజలకు వివరించారు. మరోవైపు జిల్లాలో వైసీపీనుంచి టీడీపీలోకి భారీగా చేరికలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు జోష్‌తో ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. వైసీపీ నేతలు మాత్రం అంతర్గతంగా పలుచోట్ల తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. వలంటీర్ల ద్వారా నగదు పంపిణీ, సర్వేలు, ప్రచారం చేపడుతున్నారు. ఏదేమైనా షెడ్యూల్ అనంతరం రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి. అభ్యర్థుల ప్రచారాలు ఊపందుకోనున్నాయి.

హడావుడిగా శంకుస్థాపనలు

సార్వత్రిక పోరుకు సంబంధించి శనివారం మధ్యాహ్నం షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ఎక్కడకక్కడ అధికార పార్టీ కార్యక్రమాలు నిలిచిపోనున్నాయి. ఇకపై ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, అధికారిక కార్యక్రమాలు, సమీక్షలు కుదరవు. అధికార పార్టీపైనా.. ప్రతిపక్షంపైనా ఎన్నికల కమిషన్ నిఘా ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా అంతటా అధికార పార్టీనాయకులు.. వారం రోజుల్లోనే తెగ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో హడావుడి చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేశామని చెప్పేందుకు ఆ పార్టీ నేతలు శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టారు. అయితే ఇదే సమయంలో కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు చేదు అనుభవం ఎదురైంది. ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని ప్రజలు వారిని నిలదీసిన సందర్భాలు లేకపోలేదు. కొద్ది రోజుల కిందట కురుపాం నియోజకవర్గ కొమరాడ మండలంలో రాజ్యలక్ష్మీపురం నుంచి కంచరపాడు, శివుని, కురుంపేట నుంచి అంటివలస గ్రామాలకు, గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ పంచాయతీ, గరుగుబిల్లి మండలం పిట్టలమెట్టలో రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి శంకుస్థాపన చేశారు. ఇక భామిని మండలంలో గురండి నుంచి నేరడి, బిచ్చుమానుగూడ నుంచి జాయిమానుగూడ వరకు రహదారి నిర్మాణాలకు పాలకొండ ఎమ్మెల్యే కళావతి శంకుస్థాపన చేశారు. సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో సీతంపేట నుంచి పాచింపెంట వరకు బీటీ రహదారి పనులతో పాటు పలు పనులకు ఉపముఖ్యమంత్రి రాజన్నదొర శంకుస్థాపన చేశారు. ఈ విధంగా జిల్లాలో పలుచోట్ల వైసీపీ ప్రజాప్రతినిధులు ఎన్నికల కోడ్ రాకముందే శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. అయితే ఐదేళ్లుగా వాటిని పట్టించుకోని వారు ఇప్పుడు హడావుడిగా శిలాఫలకాల ఆవిష్కరణలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ ముందే ఇవన్నీ వారికి గుర్తుకు వచ్చాయా? అంటూ జిల్లావాసులు, గిరిజన, ప్రజా సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

విధుల నిర్వహణపై అలసత్వం వద్దు

- ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ నిశాంత్‌కుమార్

గరుగుబిల్లి, మార్చి 15 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నిశాంత్‌కుమార్ హెచ్చరించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి ఉల్లిభద్రలో ఉద్యాన కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రాలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నామన్నారు. అనంతరం మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కళాశాల ఆవరణలో నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో పాటు విద్యుత్, తాగునీటి సరఫరా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో భారీ కేడ్లు, నియోజకవర్గాల వారీగా రిసెప్షన్, మీడియా సెంటర్ల ఏర్పాటును పరిశీలించారు. ఈ పరిశీలనలో ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీవోలు కె.హేమలత, రమణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పీఆర్ ఈఈ కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పకడ్బందీగా..

- పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

సాలూరు: ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి, పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్పీ, పోలీసులు ఎన్నికల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి తప్పక పాటించాలని, ఎవరికి కేటాయించిన విధులు వారు కచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఎంసీసీ, ఖర్చుల పర్యవేక్షణ కమిటీ బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న పోస్టర్లు, ఫొటోలు, బ్యానర్లు తొలగించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఎక్కడా కోడ్ ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తనిఖీల్లో పట్టుబడిన డబ్బులు, ఇతర వస్తువులను జప్తు చేసి, కేసు నమోదు చేయాలని సూచించారు. వాటి వివరాలను యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్, డీటీ తదితరులు పాల్గొన్నారు.

నియమావళిపై అవగాహన తప్పనిసరి

- సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: ఎన్నికల నియమావళిపై సిబ్బందికి అవగాహన తప్పనిసరి అని సీతంపేట ఐటీడీఏ పీవో, పాలకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి తెలిపారు. శుక్రవారం ఐటీడీఏ ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులు, నియోజకవర్గస్థాయి పోలీస్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమాలు, రిపోర్టులు సమర్పించే ఫారాలు, పోలింగ్ నిర్వహణలో సెక్టార్ అధికారులు పాటించాల్సిన అంశాలను ఆమె వివరించారు. సీ విజిల్ యాప్, పోలింగ్ స్టేషన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల కోడ్‌ను పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే బహిరంగ ప్రదేశాల్లో ఉండే రాజకీయ నాయకులకు సంబంధించిన స్టిక్కర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. సర్వైలెన్స్, ఫ్లయింగ్, వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు సమన్వయంతో పనిచేయాలన్నారు. కోడ్ ఉల్లంఘన జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు హేమసీకుమార్, పాలకొండ డీఎస్పీ కృష్ణారావు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి



సాలూరులో పోలీసులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

నేడు జాతీయ లోక్ అదాలత్

విజయనగరం (ఆంధ్రజ్యోతి), మార్చి 15: ఉమ్మడి జిల్లాకు సంబంధించి శనివారం విజయనగరంలోని నూతన కోర్టు భవనంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.సాయికల్యాణ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్, మోటార్ ప్రమాదబీమా, కుటుంబ వివాదాలు, కార్మిక, విద్యుత్, తదితర కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని న్యాయవాదులకు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- విజయనగరం జిల్లాలో 14 కేంద్రాల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

విజయనగరం కలెక్టరేట్, మార్చి 15: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జరగనుంది. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విజయనగరం జిల్లాలో 14 కేంద్రాల్లో జరగనున్న పరీక్షకు 6,568 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష జరగనుంది. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఒరిజనల్ గుర్తింపు కార్డు (పాస్ పోర్టు, ఓటర్ ఐడీ, పాన్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్) తీసుకుని వెళ్లాల్సి ఉంది. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అభ్యర్థులు సందేహాలను నివృత్తి చేయడానికి కాల్ సెంటర్లను (08922-236947, 73822 42251, 98483 81463 నెంబర్లు) ఏర్పాటు చేశారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి: డీఆర్వో



విజయనగరం జిల్లాలో గ్రూప్ -1 పరీక్ష పక్కాగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఆర్వో అనిత కోరారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటో రియంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రెండు పూటలా జరిగే ఈ పరీక్షకు అభ్యర్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరు కోవాలన్నారు. ఉదయం 9.45 గంటల తరువాత, మధ్యాహ్నం 1.45 తరువాత పరీక్ష కేంద్రాల లోపలకు ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్ష పూర్తయ్యే వరకూ అభ్యర్థులను బయటకు పంపించకూడదని చెప్పారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల జెరాక్స్ సెంటరన్లు మూసివేయాలని సూచించారు. సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని చెప్పారు. విజయనగరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ఈనెల 17 తేదీన రాత్రి 8 గంటల వరకూ పని చేస్తుందని తెలిపారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ బాబురావు, ఏఎస్‌వో సత్యనారాయణ తదితరులున్నారు.

ఐదేళ్లలో రెండుసార్లే..





సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

- సీతంపేట ఐటీడీఏలో పాలకవర్గ సమావేశాల తీరిది..
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడు సార్లు నిర్వహణ
- వైసీపీ అధికారంలోకి వచ్చాక మారిన పరిస్థితి
- అభివృద్ధికి ఆమడ దూరంలో ఏజెన్సీ ప్రాంతాలు
- ఎక్కడి సమస్యలు అక్కడే..
- మండిపడుతున్న గిరిజన సంఘాలు

(సీతంపేట)

గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటైన ఐటీడీఏలు.. వైసీపీ సర్కారు పాలనలో పూర్తిగా గాడి తప్పాయి. నిబంధనల ప్రకారం పాలకవర్గ సమావేశాలు కూడా నిర్వహించలేని స్థితికి చేరాయి. 2019 ఏడాది నుంచి ఇప్పటివరకు ఐదేళ్లలో కేవలం రెండుసార్లే సీతంపేట ఐటీడీఏలో పాలకవర్గ సమావేశాలు నిర్వహించి.. ప్రభుత్వం చేతులు దులుపుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లలో ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో గిరిజన సంఘాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి ప్రతి మూడు నెలలకొకసారి పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించాలి. ఐటీడీఏ సబ్‌ప్లాన్ మండలాలకు చెందిన జిల్లా అధికారులు, ఎమ్మెల్యే ఎమ్మెల్సీ, ఎంపీలు, జడ్పీ చైర్మన్, ఎంపీపీలు, జడ్పీటీసీలు హాజరవ్వాల్సి ఉంది. గిరిజనుల అభివృద్ధి కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ఏ మేరకు అమలవుతున్నాయో ఈ సమా వేశంలో చర్చించాల్సి ఉంది. అదేవిధంగా కొత్త పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి కీలక నిర్ణయాలను ఈ వేదికపైనే తీసుకోవాల్సి ఉంది. కాగా ఇంతటి కీలక సమావేశానికి గత టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. 2015 నుంచి 2018 వరకు ఏడు పాలకవర్గ సమావేశాలు నిర్వహించి ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

- 2015లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఏడాది ఆగస్టు 23న ..
- 2016లో ఫిబ్రవరి 20న, జూన్ 23న
- 2017లో సెప్టెంబరు 8న, అదే సంవత్సరం డిసెంబరు 8న
- 2018 సెప్టెంబరు 4న, అదే ఏడాది డిసెంబరు 7న సీతంపేట ఐటీడీఏలో పాలకవర్గ సమావేశాలు నిర్వహించారు.

వైసీపీ సర్కారు పాలనలో..

వైసీపీ సర్కారు పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత సీన్ పూర్తిగా మారింది. 2019లో సాధారణ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐటీడీఏలను పట్టించుకోలేదు. పూర్తిస్థాయిలో నిధులు కూడా కేటాయించలేదు. ఇదే సమయంలో ఎంతో కీలకమైన పాలకవర్గ సమావేశాలపైనా దృష్టి సారించలేదు. మొత్తంగా ఐదేళ్ల పాలనలో సీతంపేట ఐటీడీఏలో రెండు సార్లే పాలకవర్గ సమావేశాలు నిర్వహించారంటే.. నమ్మక తప్పదు. 2019 సెప్టెంబరు 11న, 2022 జనవరి 29న మాత్రమే 77వ ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించి మమా అనిపించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలని గడిచిన రెండేళ్ల నుంచి పదేపదే గిరిజన సంఘాలు, వామపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ స్పందించే వారే కరువయ్యారు. దీంతో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఎన్నో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. కనీస మౌలిక వసతులకు కూడా నోచుకోలేదు. సబ్‌ప్లాన్ మండలాలకు పూర్తిగా నిధులు కేటాయించకపోగా, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు రహదారుల సౌకర్యం కల్పించలేదు. జలజీవన్ మిషన్ పనులు కూడా పూర్తికాలేదు. దీంతో గిరిజనులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. విద్య, వైద్యం కోసం నేటికీ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అత్యవసర వేళల్లో డోలీలో దిక్కవుతున్నాయి. ఐదేళ్లలో ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రధాన సమస్యలు పరిష్కారం కాకపోవడంపై గిరిజనులు, ప్రజా సంఘాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ సర్కారు తీరుపై మండిపడుతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డిని వివరణ కోరగా.. ఐటీడీఏకు పూర్తిస్థాయిలో నిధులు లేకపోవడం, జిల్లాల విభజన కారణంగా పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేకపోయామని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామన్నారు.

జొన్నవలసలో జయహో బీసీ



బీసీ డిక్లరేషన్ ప్రతిని విడుదల చేస్తున్న టీడీపీ బీసీ విభాగం నాయకులు

విజయనగరం రూరల్, మార్చి 15: విజయనగరం మండల పరిధిలోని జొన్నవలసలో మండలం క్లస్టర్-2లో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ నాయకులు బొద్దల నర్సింగరావు, వేచలపు శ్రీనివాసరావు, కంది మురళీనాయుడు, కంది సాయిజగ్గారావు, గంటా పోలినాయుడు, కోండ్రు శ్రీనివాసరావు, బోని కుమార్, మామిడి దేవేంద్రనాథ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి కృషి చేసింది టీడీపీయేనన్నారు. బీసీలకు ప్రాధాన్యం ఇచ్చే టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు.

లంకాపట్టణంలో 'జయ హో ఎస్సీ'

విజయనగరం రూరల్: విజయనగరంలోని లంకాపట్టణంలో శుక్రవారం 'జయహో ఎస్సీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నగర ఎస్సీ సెల్ నాయకులు మామిడి రవిశంకర్, కందువా ప్రకాష్, లంకాపట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు శంకర్‌తో పాటు పలువురు నాయకులు ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజుని గెలిపించాలని కోరారు. టీడీపీ హయాంలో దళితుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు గుర్తు చేశారు. అదే విధంగా పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలను వివరించారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

విజయనగరం రింగురోడు: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ నెల 18 నుంచి 30 వరకూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ప్రజారవాణాధికారి అప్పలనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్స్‌ని చూపించి అన్ని పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో వారి నివాసం నుంచి పరీక్ష కేంద్రానికి, పరీక్షా కేంద్రం నుంచి ఇంటి వరకూ ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కలెక్టరేట్: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల మొదటి తేదీ నుంచి ఇప్పటి వరకూ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 73 కేంద్రాల్లో నిర్వహించిన సుమారు 43 వేలు మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 9 నుంచి 12 గంటలు వరకూ పరీక్షలు జరిగాయి. చివరి రోజున వంగర ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలోని పరీక్ష రాస్తున్న విద్యార్థి ఒకరు మాస్ కాపియింగ్ పాల్పడటంతో ఆ విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. మొదటి రోజు నుంచి చివరి రోజు వరకూ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆర్‌ఐవో మజ్జి ఆదినారాయణ తెలిపారు.

ఒకరు డీబార్

వంగర: మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడ్డాడు. ఆ విద్యార్థి చూచి రాస్తుండగా కమిషనర్ కార్యాలయం నుంచి సీసీ కెమెరాల ద్వారా గుర్తించి జిల్లా కేంద్రంలోని అధికారులకు సమాచారం అందించారు. దీంతో సంబంధిత తనిఖీ బృందం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థిని గుర్తించి డీబార్ చేసినట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు.

బేబీనాయన నిధులతో బోరు ఏర్పాటు

తెర్లాం: టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన సొంత నిధులతో వి.చిన్నయ్యపేట పంచాయతీ చుక్కవలస గ్రామంలో బోరింగు ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ బోరును ఏర్పాటు చేశారు. ఈ మేరకు బోరు ఏర్పాటు చేసిన బేబీ నాయనకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

శృంగవరపుకోట: విశాఖ పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శ్రీభరత్ సహకారంతో హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి, గీతం యూనివర్సిటీ జిమ్సర్ హస్పటల్ సంయుక్తంగా శృంగవరపుకోట ఆకుల డిపో వద్ద శనివారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. క్యాన్సర్ వైద్యని పుణులు, క్యాన్సర్ నిజ నిర్ధారణ స్కానింగ్ పరికరాలతో బస్సు అందుబాటులో ఉంటుందని, ఇతర వ్యాధులకు ఉచిత వైద్యం చేసేందుకు వైద్యులు వస్తున్నారన్నారు. ఆధార్ కార్డును తప్పకుండా వెంట తీసుకురావాలన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

బొబ్బిలి: బొబ్బిలి మండల ఏపీటీఎఫ్ శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శీర గోపాలనాయుడు అధ్యక్షతన శుక్రవారం స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటరమణ, చింతాడ రామారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్. సన్యాసినాయుడు, బి.సుధాకరరావు తదితరులను ఎన్నుకున్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరాలు

బొబ్బిలి: నారాయణప్పవలస-కాశిందొరవలస జంట పంచాయతీల్లో ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు, ఎంపీయూపీ స్కూలు హెచ్‌ఎం టి.భానుప్రకాశ్, కళ్యంపూడి ప్రసాద్, పోల అప్పలనాయుడు, పీవోలు రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు. ● **రేగిడి:** విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో ముందుండాలని జీఎంఆర్ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం పురుషోత్తమరావు, కళాశాల అధ్యాపకులు డా. రాంబాబు, కెప్టెన్ ఎస్.వెంకట్రావు పేర్కొన్నారు. మండ లంలో బాలికావలస గ్రామంలో రాజాం జీసీఎస్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వారంరోజుల సేవాకార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్స్‌పాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొని మాట్లాడారు. అనంతరం బాలికావలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రిన్స్‌పాల్ నోట్‌బుక్‌లు వితరణ చేశారు.

జాతరకు ఏర్పాట్లు చేయాలి

జామి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు జామి ఎల్లారమ్మ జాతరకు అన్నిశాఖలు పటిష్ట ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ చక్కటి పర్యవేక్షణ చేయాలని జిల్లా అంబేడ్కర్ మిషన్ మండల కన్వీనర్ ఇప్పాక ఈశ్వరరావు, జిల్లా సైనిక్ కన్వీనర్ కాటపల్లి రామరావు కోరారు. శుక్రవారం వీరు మాట్లాడుతూ సుమారు 3లక్షలకు పైగా భక్తులు వస్తున్న నేపథ్యంలో ఎక్కడికక్కడ తాత్కాలిక మరుగుదొడ్లు, చలివేంద్రాలు ఏర్పాటుతో పాటు ఉచితంగా ప్రసాద పంపిణీ చేయాలని కోరారు. మహిళా భక్తులకు ఇబ్బందులు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజాగ్రహానికి జగన్ గురికాక తప్పదు

● మాజీ మంత్రి కోండ్రు



పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

రాజాం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం శ్యాంపురం పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పొత్తు ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మూడు పార్టీల కూటమితో వైసీపీ కనుమరుగవుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన ద్రోహం, దగా, దారుణాలు బ్రిటీష పాలనలో కూడా లేవన్నారు. రాజాం పట్టణంలో రెండు కిలోమీటర్ల ప్రధాన రహదారి వేసుకోలేని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నెల 17న చిలకలూరిపేట ఉమ్మడి బహిరంగ సభలో 10 లక్షలకు పైగా ప్రజలు పాల్గొనున్నా రని అన్నారు. ఈ కార్యక్రమానికి మూడు పార్టీల నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. సుమల వెంకట మన్మథరావు, కిమిడి అశోక్‌కుమార్, గట్టి భాను, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, టంకాల కన్నంనాయుడు, గేదెల బాలమురళి, వంగా వెంకటరావు, మంతిన ఉషారాణి, కోటగిరి నారాయణరావు, మోహన్‌రావు, గొండు పద్మ తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రజాస్వామ్యవాది అని.. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో దిట్ట అని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో పురపాలక సంఘ పరిధిలోని 20వ వార్డుకు చెందిన 150 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్సీ ప్రతినిధులు మాట్లాడుతూ భారీ మెజార్టీతో కోండ్రును గెలిపించుకుంటామని ప్రమాణం చేశారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక ఏకంగా 100 సంక్షేమ పథకాలు రద్దు చేశాడని, అందులో 27 దళితులకు చెందినవే అన్నారు. నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, అంపోలు శ్రీను, యందవ సూరిబాబు, దుప్పలపూడి శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు, మజ్జి షణ్ముఖ, నాగార్జున, టి.బుజ్జి, ఎం.పైడితల్లి, బి.నా గమ్మ తదితరులు పాల్గొన్నారు. వైసీపీకి చెందిన దుంగ రాము, గొల్ల విజయ తదితరులు ఉన్నారు.

ఉద్యోగాలను అమ్ముకున్న జగన్



మాట్లాడుతున్న లలిత కుమారి

శృంగవరపుకోట మార్చి 15: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఉద్యోగాలను సీఎం జగన్ అమ్ముకున్నాడని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద విలేకర్లతో మాట్లాడారు. రాజకీయాల ద్వారా కొంత మంది సేవ చేస్తే.. ఉద్యోగాల ద్వారా మరి కొంత మంది సేవ చేస్తారన్నారు. ఇలా సేవ చేసేందుకు ఏపీపీఎస్సీ ద్వారా ఉన్నత ఉద్యోగాలను సాధించాలని కోరుకున్న యువతను ఈ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. నీతి, నిజాయితీ సమర్థతకు వేసి ఛైర్మన్‌ను నామినేట్ చేస్తారన్నారు. సమర్థ ఛైర్మన్ లేకపోతే బోర్డు అంతా సర్వనాశనమవుతుందన్నారు. 2018 గ్రూప్ -1 ఉద్యోగాల నోటిఫికేషన్‌లో అవినీతి రాజ్యమేలిందన్నారు. సమర్థతకు పాతరవేసి అక్రమార్కులకు ఉద్యోగాలు కట్టబెడుతున్నారన్నారు. కోర్టును కూడ తప్పుతోవ పట్టించిన ఏపీపీఎస్ పెద్దలు, ప్రభుత్వంపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేసారు. మండల పార్టీ అధ్యక్షుడు జీ.ఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, నాయకులు నానిగిరి రమణాజీ, కొణదం మల్లేశ్వరరావు, బీశెట్టి అరుణ, పొట్నూరు సాయిరాం, చెక్క కిరణ్ కుమార్, కాపుగంటి వాసు తదితరులు ఉన్నారు.

సమన్వయంతో ముందుకు సాగుదాం



సమావేశమైన టీడీపీ-జనసేన నాయకులు,

విజయనగరం రూరల్: విజయమే లక్ష్యంగా పనిచేయాలని అదితి గజపతిరాజు సూచించారు. టీడీపీ- జనసేన సమన్వయ లోపం విషయమై సర్వత్రా చర్చ జరుగుతున్న సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వితో పాటు నియోజకవర్గంలో కీలకంగా ఉన్న పలువురు జన సేన నాయకులు, కార్యకర్తలు సమా వేశమయ్యారు. ఎన్నికలు ప్రతిష్టాత్మకం కావడంతో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఇరు పార్టీల నాయకులు నిర్ణయించారు. ఇందుకోసం సమన్వయం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసి, తద్వారా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూసుకోవాలని తీర్మానించారు. గ్రామ, డివిజన్ స్థాయిలో జనసైనికులు, ఆయా ప్రాంతాల్లో టీడీపీ వారితో కలిసి పనిచేసే విధంగా ఇరు పార్టీలు కృషి చేయాలని నిర్ణయించారు.

ఓటరు జాబితాలో తప్పులను సరిచేయండి



వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్: ఓటరు జాబితాలో తప్పులను తక్షణమే సరిచేయాలని విజయనగరం నియోజకవర్గ ఎన్నికల సహాయ అధికారిణి రాజ్యలక్ష్మికి టీడీపీ నేతలు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నగర టీడీపీ నాయకులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, ఆల్తి బంగారు బాబు, ఏపీ రాజులు మాట్లాడుతూ తాజాగా విడుదల చేసిన జాబితాపై టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాయన్నారు. డబుల్ ఎంట్రీలు, మరణించిన వారు, వలస వెళ్లిన వారు తదితర ఓట్లు ఇంకా జాబితాలో ఉన్నాయని, వీటిని సరిచేసి, తప్పుల్లేని జాబితా ఇవ్వాలని టీడీపీ నేతలు కోరారు.

విద్యార్థులంతా ఓటేసేలా ప్రోత్సహించాలి: జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కలెక్టరేట్: ప్రజాస్వామ్య ప్రక్రియలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని జేసీ కార్తీక్ పిలుపునిచ్చారు. ఓటు వేయడం ద్వారానే ఈ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఓటు హక్కు కల్గిన విద్యార్థులంతా రానున్న సాధారణ, అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు ఓటు వేసేలా వారిని చైతన్య పరచడంలో క్యాంపస్ రాయబారులు కీలక పాత్ర వహించాలన్నారు. స్వీప్‌లో భాగంగా పలు కళాశాలల్లోని క్యాంపస్ అంబాసిడర్లతో జేసీ శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. యువతకు ఓటు విలువను తెలియజేయడం, వారు ఓటింగ్‌లో పాల్గొనేలా చేయడం, ర్యాలీలు, 2కె రన్ వంటి కార్యక్రమా లను చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాయబారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి జిల్లాలో యువత ఓటింగ్ పెంచేందుకు కృషి చేయాలన్నారు.

నేటినుంచి జామి ఎల్లారమ్మ జాతర

● హాజరుకానున్న మూడులక్షలకు పైగా భక్తులు



ఎల్లారమ్మ

జామి, మార్చి 15: నేటినుంచి జామి ఎల్లారమ్మతల్లి జాతర ప్రారంభం కానుంది. నేడు తోళ్ల సంబరంతో పాటు రాత్రి 9గంటల నుంచి లక్షలాదిమంది భక్తుల నడుమ గద్దెగుడిలో ఉన్న అమ్మవారిని వనం గుడికి తీసుకెళ్తారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసే ప్రత్యేక కార్యక్రమాలు అందరినీ అలరిస్తాయి. 17న అమ్మవారి పండగరోజున ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, చత్తీష్‌ఘడ్‌నుంచి లక్షలాది భక్తులు తరలివస్తారు. శతాబ్దాల కాలం నుంచి ఆచారంగా నిర్వహిస్తున్న దమ్మిడి తీర్థం 18న నిర్వహిస్తారు. ఈ విషయంపై ఆలయ ఈవో మాట్లాడుతూ జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అన్నిశాఖలు సమన్వయంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. శుక్రవారం అమ్మవారిని వందలాదిగా భక్తులు దర్శించుకున్నారు. ● **జామి:** మండలంలోని భీమసింగిలో ఈ నెల 17, 18 తేదీల్లో గ్రామదేవత ఎల్లారమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. జాతర సందర్భంగా 17న జిల్లా స్థాయి ఎడ్లపందాలు, ఇతర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ● **విజయనగరం రూరల్:** స్థానిక ప్రభుత్వ సంగీత కళాశాల ఎదుట ఉన్న ఎల్లమ్మ ఆలయం వద్ద ఎల్లమ్మ సిరి మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి రోజు తోలేళ్ల ఉత్సవం, 17న సిరిమానోత్సవం జరగనుంది. వచ్చే నెల 4న ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని శుక్ర వారం కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు.

టీడీపీకి పట్టం కట్టండి

● పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం



మాట్లాడుతున్న అనురాధ బేగం

విజయనగరం రూరల్, మార్చి 15: రానున్న ఎన్నికల్లో మహిళలంతా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుకి ఓటేసి, పట్టం కట్టాలని ఆ పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం చెప్పారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు విజయనగరంలో డివిజన్ల వారీగా డ్వాక్రా మహిళలతో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 9, 10, 11 డివిజన్లు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రభుత్వ హయాంలో మహిళా సంక్షేమం సంక్షోభంలోకి వెళ్లిందని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టీడీపీ మహిళా విభాగం ప్రతినిధి పత్తిగిల్లి సూర్యకుమారి మాట్లాడుతూ టీడీపీ తొలి నుంచి మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ వస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్న సమయంలోనే డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి, మహిళల్లో చైతన్యం నింపారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున 'కలలకు రెక్కలు' అనే బృహత్తర కార్యక్రమానికి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి శ్రీకారం చుట్టిందన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకి ఓటేసి, అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు. నాయకులు కంది శమంతకమణి, రౌతు పద్మ, వీరలక్ష్మి, వేలిచేటి మణికుమారి పాల్గొన్నారు.

'బాబు చెంతకి బ్రాహ్మణాస్త్రం' ప్రచార కార్యక్రమం



ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్, మార్చి 15: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరుతూ జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 'బాబు చెంతకి బ్రాహ్మణాస్త్రం' అనే కార్యక్రమాన్ని శుక్రవారం 14వ డివిజన్ పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ హయాంలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 14వ డివిజన్‌కు వచ్చిన బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులకు టీడీపీ నాయకుడు డాక్టర్ పేరిరామయ్య, ఆయా డివిజన్ ఇన్‌చార్జి మద్దాల నాగమ్మ, టీడీపీ యువజన విభాగం నాయకుడు బలివాడ రవి స్వాగతం పలికారు.

కళాకు టికెట్ ఖరారులో జాప్యం ఎందుకు?

రాజాం: సీనియర్ టీడీపీ నాయకుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావుకు ఎచ్చెర్ల నియోజకవర్గం టికెట్ ఇవ్వడంలో జాప్యం ఎందుకని తూర్పుకాపు సంక్షమ సంఘం నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం శ్రీకాకుళం రోడ్డులో సూర్యదుర్గ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీపీ పైలవెంకటరమణ, టంకాల వెంకటేషం తదితరులు ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. పొలిట్ బ్యూరో సభ్యులకే ఇటువంటి పరిస్థితి రావడంతో ప్రజల్లో తప్పుడు సంకేతాలకు తావిస్తుందన్నారు. టంకాల దిలీప్‌కుమార్, ఉదయాన మురళీకృష్ణ తదితరులు సమావేశంలో మాట్లాడారు.

ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ డిగ్రీ కళాశాల 40 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్ ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు ఉన్నారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక


విజయనగరం క్రైం/డెంకాడ: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల అనంతరం ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ దీపిక శుక్రవారం పరిశీలించారు. లెండి ఇంజనీరింగు కళాశాల పరిసర ప్రాంతాలతో పాటు స్ట్రాంగ్ రూంను, కౌంటింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కళాశాల యాజమాన్యంతో పాటు పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కట్టుదిట్టమైనభద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ గోవిందరావు, భోగాపురం సీఐ వెంకటేశ్వరావు, విజయనగరం రూరల్ సీఐ శ్రీనివాసరావు, డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పథకం మహిళలకే

రాజాం: ప్రతి ప్రభుత్వ పథకం మహిళలకే ఇస్తున్న మహిళా పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డి అని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మహిళలకు చేయూత పథకాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తు తం అందజేస్తున్న చేయూత పథకం మహిళలు అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. చేయూత ద్వారా రాజాం నియోజకవర్గంలో 20589 మందికి లబ్ధి చేకూరిందన్నారు.

కన్నులపండువగా పోలిపల్లి పైడితల్లి నేత్రోత్సవం

● పట్టువస్త్రాలు సమర్పించిన వంశపారంపర్య ధర్మకర్తలు





అమ్మవారు, పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

రాజాం రూరల్, మార్చి 15: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి నేత్రోత్సవం శుక్రవారం సాయంత్రం కన్నులపండువగా జరిగింది. ఈనెల 17 నుంచి 19 వరకూ నిర్వహించనున్న అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని సుమారు రెండున్నర గంటల పాటు ఘనంగా నిర్వహించారు. నేత్రోత్సవం అనంతరం అమ్మవారిని దర్శించుకుని భక్తజనం పులకించారు. వంశపారంపర్య ధర్మకర్తలు వాకచర్ల కుటుంబీకులు అమ్మవారి తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పించారు. ● తొమ్మిది దశాబ్దాలకు పైగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, వారి కుటుంబీకులు వాకచర్ల రాజా, వాకచర్ల పైడిరాజు తదితరులంతా బ్యాండుమేళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయానికి చేరుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వంశపారంపర్య ధర్మకర్తలు అమ్మవారి బుగ్గపై కాటుకతో చుక్క పెట్టి ఆలయం నుంచి వెనుదిరిగారు. ● శుక్రవారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఓవైపు నేత్రోత్సవం జరుగుతుండగా కొండంపేట గ్రామానికి చెందిన ఘటాల పూజారి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆలయానికి చేరుకుని నేరుగా గర్భగుడి లోనికి ప్రవేశించారు. కర్ర ప్రతిమలను అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు. అక్కడి నుంచి ఆలయానికి ఎదురుగా ఉన్న వనంగుడి వద్దకు వెళ్లి కర్ర ప్రతిమలను అక్కడ ఉంచి పూజలు చేశారు. అక్కడి నుంచి తిరిగి నేరుగా గర్భగుడిలోనికి రెండోసారి చేరుకున్నారు. పూజల అనంతరం అమ్మవారిని కర్రప్రతిమలలో ఆవాహన చేసి కొండంపేట లోని ఘటాలయానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో బి.వి.మాధవరావు, ఎస్.వి.ఆర్. కళాపరిషత్ అధ్యక్షులు సలాది తులసీదాస్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

తూర్పుకాపులకు న్యాయం జరిగే వరకూ పోరాటం



నిరసన తెలుపుతున్న తూర్పు కాపు సంఘ సభ్యులు

విజయనగరం దాసన్నపేట: జిల్లాలో తూర్పు కాపులు అత్యధికంగా ఉన్నారని... జనాభా ప్రాతిపదికన ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు కేటాయించే వరకూ పోరాటం చేస్తామని ఆ సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు, జిల్లా అధ్యక్షుడు రొంగలి రామారావు హెచ్చరించారు. తూర్పుకాపులకు సరైన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరవధిక నిరహార దీక్ష చేపట్టారు. విజయనగరం ఎంపీ టిక్కెట్‌తో పాటు, ఎమ్మెల్యే స్థానాలను కేటాయించాలని కోరారు. జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రం అందించి, నిరహార దీక్ష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు మంత్రి రమణమూర్తి, చంద్రమౌళి, వెంకటరమణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం

● బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో వెలుగుచూసిన ఘటన

● ఉద్యోగిని తొలగించిన అధికారులు

బొబ్బిలి, మార్చి 15: నకిలీ ఇంజినీరింగ్ సర్టిఫికెట్లతో బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో ఏటీవోగా ఉద్యోగం నిర్వహిస్తున్న మెట్ట సిద్ధార్థ్ అనే యువకుడిపై వచ్చిన ఫిర్యాదుపై సంబంధిత అధికారులు దర్యాప్తు నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన నకిలీ సర్టిఫికెట్లతో చేరినట్లు నిర్ధారణ కావడంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన సిద్ధార్థ్ ప్రభుత్వ ఐటీఐలో 2021లో ఏటీఓగా(అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్) చేరాడు. కిల్లాడ గ్రామానికి చెందిన మురళి అన్నదానం, బొబ్బిలి తారకరామాకాలనీకి చెందిన విద్యార్థుల సంఘం నాయకుడు ఇతని సర్టిఫికెట్లపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు చేశారు. దీంతో సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు విజయనగరం ఐటీఐ ప్రిన్సిపాల్ గిరి, విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దర్యాప్తులో నకిలీ సర్టిఫికెట్లు అని నిర్ధారణ కావడంతో అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిఫారసు చేశారు. దీంతో సిద్ధార్థని ఉన్నతాధికారులు ఉద్యోగంలో నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీ రమణారావు శుక్రవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా అందజేస్తున్నామని ఆయన తెలిపారు.

యువకుడి మృతి



భోగాపురం, మార్చి 15: గుండెపోటుతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం మండలం ముడిదాంకు చెందిన ఎస్ రమణ(35) గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం ఇతను విజయనగరం నుంచి మండలంలోని పలు గ్రామాలకు గ్యాస్ డెలివరీ చేస్తుంటాడు. ఈ క్రమంలో గ్యాస్ డెలివరీ చేయడానికి శుక్రవారం ఆటోపై వస్తుండగా రామచంద్రపేట గ్రామంలో ఆటోలోనే గుండెపట్టుకొని విలవిలలాడుతుండడంతో స్థానికులు గమనించి వెంటనే సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. రమణ అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య భూలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సీహెచ్‌సీలో స్లాబ్ పెచ్చులూడి ఒకరికి గాయాలు

భోగాపురం: మండలం భోగాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్లాబ్ పెచ్చులు ఊడి పడి విధులు నిర్వహిస్తున్న లావణ్యకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో ఆమెకు స్థానిక వైద్యులు చికిత్స అందించారు. దీనిపై వైద్య అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా స్లాబ్‌పైన వాటర్ ట్యాంకు ఉండడంతో అది నాని స్లాబ్ పెచ్చులు ఊడి పోయాయని, దీనికి మరమ్మతులు చేశామన్నారు.

బస్సు, బైకు ఢీ.. ఇద్దరికి గాయాలు

పాలకొండ: ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని తంపటాపల్లి జంక్షన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పాలకొండ మండలం టీకేరాజపురం గ్రామానికి చెందిన పొగిరి సూరిబాబు, నేతల మాధవ్ అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామం నుంచి పాలకొండ వైపు వస్తున్నారు. తంపటాపల్లి జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి, ఎదురుగా పాలకొండ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే వారిని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మాధవ్ అనే యువకుడి మోకాలికి తీవ్రమైన గాయమైంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి మృతి

సీతానగరం (బలిజిపేట): బలిజిపేట మండలం వెంగపురం గ్రామానికి చెందిన యామల రాంబాబు (29) శుక్రవారం ఉరి వేసుకుని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాంబాబుకు భార్యతో ఇటీవల గొడవలు వచ్చాయి. కొద్దిరోజులు దూరంగా ఉంచితే గొడవలు సద్దుమణుగుతాయని భావించిన భార్య తల్లిదండ్రులు ఆమెను ఇటీవల కన్నవారింటికి తీసుకెళ్లారు. దీంతో రాంబాబు మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం సాయంత్రం బాత్‌రూమ్‌కు వెళతానని తల్లితో చెప్పి వెళ్లిన రాంబాబు ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో ఆమె వెళ్లి చూసేసరికి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో అతన్ని కిందకి దించి...ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పాపారావు తెలిపారు.

టీమాస్టర్ ఆత్మహత్య

సూళ్లూరుపేట, మార్చి 15: టీ మాస్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సూళ్లూరుపేట పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... విజయనగరం జిల్లా వంగర మండలం కింజంగి గ్రామానికి చెందిన తెర్లి సత్యనారాయణ(32) సూళ్లూరుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్దనున్న టీ షాపులో ఏడేళ్లుగా టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. బస్టాండు వెనుకనున్న అపార్ట్‌మెంటులో నివాసం ఉంటున్న సత్యనారాయణ శుక్రవారం ఉదయం దుకాణానికి వచ్చాడు. గదిలో నగదు మరిచిపోయాని క్యాషియర్ శేఖర్‌కు చెప్పి ఇంటికి వెళ్లా డు. చాలా సేపటి వరకు రాకపోవడంతో దుకాణంలో పనిచేస్తున్న మరో వ్యక్తి వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న దు కాణ యజమాని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రహీం రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అం దించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిక్ బాక్సింగ్‌లో జేఎన్‌టీయూ విద్యార్థి ప్రతిభ



దినేష్‌ని అభినందిస్తున్న వీసీ వెంకట సుబ్బయ్య

విజయనగరం రూరల్: నగర శివార్లలోని జేఎన్‌టీయూ మహిళలు, పురుషుల జట్టు కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచాయి. ఈ నెల 5 నుంచి 9 వరకూ మీరట్‌లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రీడలు జరిగాయి. కిక్ బాక్సింగ్ పురుషులు 58 కిలోల విభాగంలో రఘు కళాశాల విద్యార్థి కె.దినేష్ కాంస్య పతకం సాధించారు. ఆ విద్యార్థిని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ జయసుమ సత్కరించారు. స్పోర్ట్సు కౌన్సిల్ కార్యదర్శి ఎస్. విజయమోహన్, కో-ఆర్డినేటర్ ఏవీ పాపారావు, పీడీ నాగరాజు తదితరులు అభినందించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ, జనసేన నాయకుల ప్రచారం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ, జనసేన నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాలోని పలు చోట్ల ప్రచారం చేసి, ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

టీడీపీని గెలిపించుకుందాం

పార్వతీపురంటౌన్: రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే టీడీపీని గెలిపించుకుందామని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, పార్టీ మహిళా విభాగం నాయకురాలు డి.శ్రీదేవి అన్నారు. ఆమె శుక్రవారం 14వ వార్డులోని గూడ్స్‌షెడ్ రోడ్డు, గొల్లవీధి, తదితర వీధుల్లోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా అధ్వాన్నంగా ఉందని, కాలువల్లో మురుగునీరు ఎక్కడదక్కడే నిలిచిపోవడంతో దుర్వాసనలతోపాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు ఆమె వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో పట్టణంలో 30 వార్డులు సమస్యల వలయంలో చిక్కుకున్నాయన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని చూపించి వైసీపీ నాయకులు కాలం గడిపేస్తున్నారని ఆమె ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టిన వెంటనే పట్టణంలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుందన్నారు.

వైసీపీకి చరమగీతం పాడాలి

పాలకొండ: రానున్న ఎన్నికల్లో అసమర్థ వైసీపీ ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు కోరారు. కొండాపురం గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరణం నారాయణరావు, చేబోదుల లక్ష్మీనారాయణ, శేషపు సుగుణాకరరావు, బెవర శ్రీనివాసరావు, కిమిడి బంగారునాయుడు, కనుముల స్వామినాయుడు, రామ్మూర్తి, కిమిడి సూర్యారావు, అల్లు పారినాయుడు, మురళి పాల్గొన్నారు.

మొండెంఖల్‌లో సూపర్ సిక్స్‌పై ప్రచారం

కురుపాం రూరల్: తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయిక జగదీశ్వరిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం మొండెంఖల్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీలపై వివరించారు. ఈ


గుమ్మలక్ష్మీపురం: టీడీపీలో చేరినవారితో జగదీశ్వరి

కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కలిశెట్టి కొండయ్య, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రంజిత్ కుమార్ నాయికో, డా.బెహరా శ్రీను, వెంపటాపు భారతి, జనసేన నాయకుడు నేరేడుబిల్లి వంశీ తదితర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

గుమ్మలక్ష్మీపురం: గోయపాక పంచాయతీ వాడజంగి గ్రామంలో 90 గిరిజన కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులమై.. అభివృద్ధి చేస్తుందనే నమ్మకంతో తాము టీడీపీలో చేరినట్టు వారు తెలిపారు. కురుపాం అభ్యర్థి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.


పార్వతీపురంటౌన్: 14వ వార్డు గూడ్స్‌షెడ్ రోడ్డు వీధి ప్రజలతో మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి


పాలకొండ: సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు


కురుపాం రూరల్: మొండెంఖల్‌లో ప్రచారం

సిర్లిపోతన్న జాతరకు వేళాయే


జాతరకు ప్రచారం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రవాసుల ఇలవేల్పు యర్రకంచ మ్మ, ఇప్పలపోలమ్మ, బంగారమ్మల సోదరుడు సిర్లిపోతన్న జాతర ఈనెల 17వ తేదీ ఆదివారం జరుగుతుందని ఆలయ పూజారి రాము తెలిపారు. సిర్లిపోతన్న జాతరకు రావాలని కోరుతూ శుక్రవారం పూజారి రాము ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలు వీధుల్లో మేళాతాళాలతో ఆలయ నిర్వాహకులు ప్రచారం చేశారు. ఈసందర్భంగా పూజారి రాము మాట్లాడుతూ జాతర రోజు ఉదయం 5 గంటల నుంచి ఆలయంలోని సిర్లిపోతన్నను దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు తమ వంతుగా జాతరకు సహకరించాలని కోరారు.

జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఈశ్వరరావు

సాలూరు (పాచిపెంట): అటవీ ఉత్పత్తులను గిరిజన సహకార సంస్థ ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని సీపీఎం నాయకుడు కోరాడ ఈశ్వరరావు కోరారు. కుమ్మరివలస గ్రామంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కుంకుడుకాయలు కిలో రూ.100కు జీసీసీ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట చేతికి వచ్చేసరికి దళారుల బెడద తప్పడం లేదని, దీనివల్ల గిరిజన రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగు పిక్కలు, ఇండుగ పిక్కలు, కొండ తామర జిగురు, తదితర అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు దీసరి వసంతరావు, గిరిజన సంఘం నాయకులు బి.వీరరాజు, ఎస్.లక్ష్మణరావు, కె.త్రినాథ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సాలూరు రూరల్: అంటివలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థులను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు శుక్రవారం పరామర్శించారు. ఈనెల 12న పాఠశాలలోని 16 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురి కాగా, మామిడిపల్లి పీహెచ్‌సీకి పది మందిని, సాలూరు ఏరియా ఆసుపత్రికి ఆరుగురిని తరలించినట్టు ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. గంటల వ్యవధిలో కోలుకోవడంతో తిరిగి పాఠశాలకు తీసుకొచ్చినట్టు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధతో ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వం గిరిజన విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించడం స్వాగతించదగ్గ విషయమన్నారు. గిరిజన ఏటీడబ్ల్యూవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీసీసీ కార్యాలయం పరిశీలన


గోడౌన్‌ను పరిశీలిస్తున్న మహేంద్ర

గుమ్మలక్ష్మీపురం: జీసీసీ కార్యాలయాన్ని, పెట్రోల్ బంకు, గ్యాస్ గోదాములను పార్వతీపురం గిరిజన సహకార సంస్థ డివిజన్ మేనేజర్ మహేంద్ర శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా గుమ్మలక్ష్మీపురం జీసీసీ మేనేజర్ కృష్ణ ప్రసాద్ తదితర సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. జీసీసీ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. పనులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో ఈ భవన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. జీసీసీ సేల్స్ మేన్‌లు, సీసీ, పీఏలు, అటవీ ఫలసాయాల కొనుగోలు, నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ అమ్మకాలు పెంచడం తదితర వ్యాపారాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

గరుగుబిల్లి: గ్రామాల్లో వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. శుక్రవారం ఉల్లిభద్రలో వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధికంగా ఎండలు ఉంటున్న దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలన్నారు. వైద్య శిబిరంలో పరీక్షల అనంతరం అవసరమైన మందులను గరుగుబిల్లి వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో ఈవో పీఆర్‌డీ ఎల్.గోపాలరావు, కార్యదర్శి కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం

● ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయదేవి



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఆర్జేడీ చిన్మయదేవి

కొమరాడ: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ఆర్జేడీ జి.చిన్మయదేవి అన్నారు. కొమరాడ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం సందర్శించారు. పౌష్టికాహార వారోత్సవాలు సందర్భంగా నిర్వహిస్తున్న అవగాహన సదస్సులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత లోపించకుండా ఉండేందుకు పౌష్టికాహారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ రాణి, కొమరాడ ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోస్టర్ ప్రజంటేషన్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి పి.రాజ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ జయమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై దృష్టి

గరుగుబిల్లి: గ్రామస్థాయిలో మహిళలు పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలని జాతీయ సేవా పథకం అధికారి డా.బి.హరిరామకుమార్ అన్నారు. సంతోషపురం, సుంకి పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కాయగూరల పెంపకంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.నరసింహమూర్తి, పి.ప్రదీప్‌కుమార్, బి.సుజాత, ఆర్.రాజ్యలక్ష్మి, సర్పంచ్ కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎఫ్ పోరాటంతోనే పుస్తకాల సరఫరా

గుమ్మలక్ష్మీపురం: ట్రైబుల్ రైట్స్ ఫోరం పోరాట ఫలితంగానే రాష్ట్రంలోని సచివాలయాలకు పోటీ పరీక్షల పుస్తకాలను సరఫరా చేసిందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లోవరాజు తెలిపారు. గతంలో గ్రూప్-1, 2, డీఎస్సీ పరీక్షలకు ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల వారు పుస్తకాలు కనుక్కోవడానికి ఇబ్బంది పడేవారని తెలిపారు. తమ పోరాటంతో ప్రభుత్వం అన్ని గ్రామ సచివాలయాలకు పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేసిందని తెలిపారు.

ఘనంగా సంధ్యారాణి జన్మదిన వేడుకలు


పుట్టినరోజు వేడుకల్లో సంధ్యారాణి, పక్కన భంజ్‌దేవ్

సాలూరు: తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి పుట్టినరోజు వేడుకలను సాలూరులోని ఆమె నివాసంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న పాచిపెంట, మెంటాడ, మక్కువ, సాలూరు పట్టణం, మండలాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, అభిమానులు, పార్టీ శ్రేణులు వచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ.భంజ్‌దేవ్ కేక్ కట్ చేసి ఆమెకు మిఠాయిలు తినిపించారు. అనంతరం నూతనంగా సిద్ధం చేసిన పార్టీ ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈసారి నియోజకవర్గంలో ఎట్టి పరిస్థితుల్లోనూ టీడీపీ జెండా రెపరెపలాడాలని ఆకాంక్షించారు. సంధ్యారాణి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. సంధ్యారాణి మాట్లాడుతూ ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని.. నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేస్తానని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రిషివర్ధన్, శివకృష్ణ, కౌన్సిలర్లు సీతమ్మ, హర్షవర్ధన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముఖీ సూర్యనార యణ, పార్టీ మండల అధ్యక్షులు ప్రసాదరావు, వేణు, పరమేష్, వెంకటరమణ, నిమ్మాది తిరుపతిరావుతో పాటు బీజేపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

సీతానగరం: ఎన్నికల నోటిఫికేషన్ శనివారం విడుదల కానున్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తూచా తప్పకుండా పాటించాలని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు అధికారి, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే గ్రామాల్లోని వివిధ పార్టీలకు చెందిన కరపత్రాలు, పోస్టర్లను తొలగించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, డిజిటల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ సెలవులు పెట్టరాదన్నారు. నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందని తెలిపారు. తహసీల్దార్ జనార్ధనరావు మాట్లాడుతూ ఎన్నికలు జరిగేవరకు అంతా సక్రమంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కుమార్‌వర్మ, 35 పంచాయతీల కార్యదర్శులు, 21 గ్రామ సచివాలయాల రెవెన్యూ అధికారులు, డిజిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

● **గరుగుబిల్లి:** పంచాయతీల పరిధిలో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, తహసీల్దార్ జయ సూచించారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, మహిళా పోలీస్ సిబ్బందికి ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వ సిబ్బంది వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామ వలంటీర్లు ప్రచారాల్లో పాల్గొనకూడదన్నారు. నిబంధనలు ధిక్కరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఆర్ఐ ఎం.కృష్ణతో పాటు కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

మక్కువ: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి పుట్టినరోజు సందర్భంగా నంద గ్రామంలో వాలీబాల్ పోటీలు నిర్వహించగా, విజేతలకు టీడీపీ సీనియర్ నాయకుడు మావుడి ప్రసాదరావు శుక్రవారం బహుమతులు అందిం చారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అక్కెన తిరుపతిరావు, దాకేటి గౌరునాయుడు, జాగాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

గరుగుబిల్లి: జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన 15 మండలాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అరకు మాజీ లోక్‌సభ సభ్యురాలు కొత్తపల్లి గీత సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు పార్వతీపురంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

సారా స్వాధీనం

సీతంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అక్రమంగా సారా తరలిస్తున్న చిన్నబగ్గ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నామని ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు చిన్నబగ్గ గ్రామ సమీపంలో మాటు వేయగా, 60లీటర్ల సారాను మైదాన ప్రాంతాలకు అమ్మడానికి తీసుకెళ్తున్నట్టు గుర్తించామన్నారు. వెంటనే పట్టుకుని, అరెస్టు చేసి, రిమాండ్ తరలించామని చెప్పారు.

గుమ్మలక్ష్మీపురంలో డ్రైడే

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపంలోని సుందరయ్య కాలనీలో శుక్రవారం మలేరియా సిబ్బంది, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమంలో సచివాలయ కన్వీనర్ జె.వెంకటరావు, భద్రగిరి మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ జి.కేశవరావు, ఆశాలు పాల్గొన్నారు.

నాడు-నేడు బిల్లులు మంజూరు చేయండి

పాలకొండ: నాడు-నేడు ఫేజ్-1లో భాగంగా పనులు పూర్తయిన పాఠశాలలకు బిల్లులు మంజూరు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారిణి గార పగడాలమ్మను బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తండాడి అనీల్ కుమార్, గొల్ల ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవా రం వినతిపత్రం అందించారు. పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవడంతో సొంత ఖర్చుతో పూర్తి చేయించిన హెచ్‌ఎంలు, విద్యా కమిటీ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై స్పందించిన డీఈవో బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

సాలూరు: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు కోరారు. పట్టణంలో వైటీసీలో శుక్రవారం ఆయన ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

విద్యార్థికి అభినందన

రేగిడి: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా, వీరిలో సంకిలి హైస్కూల్ విద్యార్థిని బి.హరిత పాఠశాల సత్తాను రాష్ట్ర స్థాయిలో మార్మోగించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. చిత్తూరు జిల్లాలో ఈనెల 11నుంచి 13వరకు జరిగిన పోటీల్లో ఉమ్మడి జిల్లాలనుంచి సంకిలి హైస్కూల్‌కు చెందిన బి.హరిత బహుళార్థక అధునాతన సాధకం ప్రాజెక్టు, కొత్తవలసలోని గురుకుళ విద్యార్థి జి.పూజిత ప్రదర్శించిన జీవసంచుల ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు సంకిలి హెచ్‌ఎం రామినాయుడు తెలిపారు. ఈ హరితకు శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం ఆధ్వర్యంలో అభినందించారు.

రేపటి నుంచి కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర


కనక మహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవా లు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీని కోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ కమిటీ జాతర ఏర్పాట్లు చేస్తోంది. తొలి రోజైన ఆదివారం వేకువజామున రెండు గంటలకు మొదటి పూజ జరుగుతుంది. ఉదయాన్నే సంప్రదాయం ప్రకారం నేత్రోత్సవం జరిపిస్తారు. ఏడు గంటల నుంచి పాలధారోత్సవం, మధ్యాహ్నం మూడు గంటల నుంచి అమ్మవారి ఘటాలు, ప్రభలతో ఊరేగింపు నిర్వహిస్తారు. రెండో రోజైన సోమవారం తొలేళ్ల ఉత్సవం, సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. మూడో రోజైన మంగళవారం ఘటోత్సవంతో పాటు పట్టణంలో ఉన్న కోటదుర్గమ్మ, అసిరితల్లి, భగీరథమ్మ, సిర్లి ఎల్లమాంబ, సంతానలక్ష్మి అమ్మవార్లకు భక్తులు పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులు ఆపాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీ చంపావతి నది ఒడ్డిన చేపడుతున్న శ్మశానవాటిక అభివృద్ధి పనులను నిలుపుదల చేయాలంటూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లిమర్ల జూట్ మిల్లు యాజమాన్యం శ్మశానవాటిక స్థలం తమదంటూ ఇటీవల హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల మేరకు శ్మశానవాటిక స్థలంలో ఎటువంటి పనులు చేపట్టకూడదని తహసీల్దార్ డి.ధర్మారాజు తెలియజేశారు. ఈమేరకు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు.

ఆన్‌సైట్ కంపోస్టింగ్‌కు ప్రోత్సాహం


తారకరామకాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: అపార్టుమెంట్లలో ఉన్న వారికి హెచ్ డీపీఈ బిన్‌లను పంపిణీ చేసి ఆన్‌సైట్ కంపోస్టింగ్ నిర్వహణకు మున్సిపాలిటీ తరఫున సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తామని కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక స్వామివారి వీధి, తారకరామ కాలనీ, సాయినగర్, పాకీవీధిలో పర్యటించారు. ఆన్‌సైట్ కంపోస్టింగ్ ద్వారా మిద్దెతోటలను పెంచుకోవాలని సూచించారు. స్వామివారి వీధి రోడ్డు పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు. ఆమె వెంట వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

పన్ను బకాయిలు వసూలు చేయాలి

బొబ్బిలి: పట్టణ పరిధిలోగల సచివాలయాల కార్యదర్శులు, ఇన్‌చార్జిలు, నోడల్ అధికారులు ఆస్తిపన్ను బకాయిల వసూళ్ల లక్ష్యాలను కచ్చితంగా నెరవేర్చాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం ఆమె తమ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్వో ప్రసాదరావు, ఆర్ఐ త్రినాథరావు, అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి


జనసేనలో చేరినవారితో రిషివర్ధన్

మక్కువ: టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత జనసేన శ్రేణులపై ఉందని పార్టీ మండల అధ్యక్షుడు గేదెల రిషివర్ధన్ అన్నారు. నంద పంచాయతీ పెద్ద ఊటగడ్డ గ్రామంలో శుక్రవారం వంద కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతం పలికారు. జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంపడాపు సుగుణేశ్వరరావు, గొట్టాపు వెంకటేష్, బంగార్రాజు, జనసైనికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు


పరీక్ష రాసి బయటకొస్తున్న విద్యార్థులు

బెలగాం: ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్ జిల్లా అధికారి మంజులవీణ తెలిపారు. ఈనెల 20 వరకు ఒకేషనల్ పరీక్షలు జరగుతాయని వెల్లడించారు. ఇంటర్ పరీక్షలు అయిపోవడంతో విద్యార్థులు మెయిన్స్, ఎంసెట్ కోచింగ్‌లకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ● **భామిని:** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ముగిశాయి. శుక్రవారం 258 మంది విద్యార్థులకు 15 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల చీఫ్‌గా ఎర్రంనాయుడు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా సురేష్ పరీక్షల వివరాలను పర్యవేక్షించారు.

భామినిలో చిరుజల్లులు

భామిని: మండలంలో శుక్రవారం ఉదయం చిరుజల్లులు పడ్డాయి. లివిరి నుంచి సింగిడి వరకు మాత్రమే ఈ చిరుజల్లులు కురవడం విశేషం. ఈ వర్షం నువ్వు పంటకు అనుకూలంగా ఉంటుందని రైతులు పాల్గొన్నారు.


భామినిలో రోడ్డుపై చేరిన వర్షపునీరు

విలేకరుల సమస్యల పరిష్కారానికి కృషి

రాయగడ: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిత్యం సమాజ హితం కోరే పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రముఖ పాత్రికేయుడు బాదల్‌దా మాట్లాడుతూ 2005వ సంవత్సరంలో పాత్రికేయుల సంక్షేమం కోసం జర్నలిస్ట్ రిలీఫ్ ఫండ్‌లో అనేక విషయాలు పొందుపర్చారని, వారి పిల్లలకు విద్య కోసం నెలకు రూ.1,500, జర్నలిస్ట్ మృత్యువాత పడితే కుటుంబానికి రూ.4లక్షలు ఆర్థిక సహాయం, ఇంటి లోను తీసుకుంటే బ్యాంకు వడ్డీ రాయతీపై 3శాతం వంటి అనేక అంశాలు ఉన్నా అవి ఆచరణకు నోచుకోలేదన్నారు. విలేకర్లకు అతి ముఖ్యమైన రెండు డిమాండ్లు ఉన్నాయని మొదటిది రైల్వే పాసు, రెండోది పింఛన్. ఈ రెండు వెంటనే పరిష్కరించే దిశగా బీజేపీ కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా శివపట్నాయక్.. కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఒడిశా

కళ్యాణ సింగపూర్ ఐఐసీగా నీలకంఠ బెహరా

రాయగడ: కళ్యాణ సింగుపూర్ సమితి కేంద్రం థాణా అధికారిగా నీలకంఠ బెహారా నియమితులయ్యారు. ఇంతకు ముందు ఈయన చంద్రపూర్ సమితి పోలీసుస్టేషన్ అధికారిగా విధులు నిర్వర్తించారు. కళ్యాణ సింగుపూర్ థాణా అధికారి సుమంత్ మహంతి బదిలీ అయన తర్వాత ఆయన స్థానంలో నీలకంఠ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ పటిష్ఠంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని, పెట్రోలింగ్ పెంచుతామని తెలిపారు.